andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్
జిల్లా వార్తలు

1

బుధవారం 1 మే 2024

'పది' ఫలితాల్లో బాలికలదే పైచేయి





కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

Results

- 93.72 శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా
- జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 14వ స్థానం
- 10 జీపీఏ సాధించిన 103 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 158 ప్రభుత్వ, 85 ప్రైవేట్ పాఠశాలల్లో వందశాతం ఫలితాలు
- జడ్పీ, మోడల్, గురుకుల, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా 93.72 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో జిల్లా 14 స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 21,858 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 20,486 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 10,714 మంది పరీక్షలు రాయగా 94.79 శాతం ఉత్తీర్ణతతో 10,156 మంది పాస్ అయ్యారు. 11,144 మంది బాలురు పరీక్షలు రాయగా 92.70 ఉత్తీర్ణత శాతంతో 10,330 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 243 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. ఇందులో 158 పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలుగా కాగా 85 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 284 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ఇందులో 103 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన వారు ఉండగా 181 మంది ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన వారు ఉన్నారు.

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాల్లో సత్తాచాటారు. జిల్లాలోని ఏయిడెడ్, ఏకలవ్య, కేజీబీవీ, జ్యోతిబా పూలే, మైనార్టీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, జడ్పీహెచ్‌ఎస్, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 158 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. అందులో కేజీబీవీలు -12, బీసీ వెల్ఫేర్ - 09, ప్రభుత్వ పాఠశాల -01, మోడల్ స్కూల్ -04, రెసిడెన్షియల్ పాఠశాలలు -3, సోషల్ వెల్ఫేర్ -05, మినీ రెసిడెన్షియల్ -08, జిల్లా పరిషత్ -116 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి.



10 జీపీఏ సాధించిన భీమ్‌గల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని అపూర్వను అభినందిస్తున్న ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు

పెరిగిన ఉత్తీర్ణత శాతం

పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలను సాధించింది. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది 87.12 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 21 స్థానంలో నిలువగా ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగి 14వ స్థానంలో నిలిచింది. 2019-20, 2020-21 విద్యాసంవత్సరాలలో కరోనా కారణంగా విద్యార్థులను ప్రమోట్ చేయడంతో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 2021-22లో జిల్లా 92.84 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 18వ స్థానంలో నిలిచింది. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులను విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి సన్నద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్పెషల్ తరగతులు నిర్వహించారు. మంగళవారం పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించడంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును డీఈవో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈవోను కలెక్టర్ అభినందించారు.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఎవరైనా మార్కులు తక్కువగా వచ్చినట్లు గ్రహిస్తే రీకౌంటింగ్ కోసం 15 రోజుల లోపు ప్రతి సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించాలని, రీ వేరిఫికేషన్ కోసం రూ.1000 ప్రతి సబ్జెక్టుకు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు.



కష్టమే

- జిల్లాలో పెరుగుతున్న ఎండలు
- 45 డిగ్రీలకు చేరువగా పగటిపూట ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న జిల్లా వాసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: జిల్లాలో రోజురోజుకూ నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో ఇళ్లలో ఉండటం కూడా కష్టంగా మారుతోంది. దీంతో ప్రజలు కూలర్లు, ఫ్యాన్‌లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. గడిచిన రెండు నెలలుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా ప్రస్తుత మే నెల మరింత కష్టంగా మారనుందని పలువురు వాపోతున్నారు. జిల్లాలో మంగళవారం వర్ని మండలం జాకోరాలో 44.8 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ సౌత్‌లో 44.3, పెర్కిట్‌లో 44.3, మోర్తాడ్‌లో 44.2, పోతంగల్‌లో 44.1, వేంపల్లిలో 43.9, సాలూరలో 43.9 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన నాలుగైదు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకే విధంగా నమోదవుతున్నాయి. 45 డిగ్రీలకు చేరువగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మే నెలలో భానుడు మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.





ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

- పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ జగిత్యాల నియోజకవర్గం పరిధిలో ప్రచారం నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో మహిళలు, వృద్ధులు, రైతుల కోసం ఎన్నో పథకాలను అమలు చేశామని ఆయన తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి చెందిందని అన్నారు. జీవన్‌రెడ్డి, అర్వింద్‌లు ఇద్దరు తోడు దొంగలేనని వారికి ఓటు వేస్తే లాభం లేదని ఆయన విమర్శించారు. బాండ్ పేపర్ రాసి గెలిపిస్తామని చెప్పుకున్న అర్వింద్ గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. ఓట్ల సమయంలో వచ్చి చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. అన్ని కుల సంఘాల కుల వృత్తుల అభివృద్ధికి కృషి చేసింది అప్పటి సీఎం కేసీఆర్ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడేది బీఆర్‌ఎస్ అని తనను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. తాను స్థానికంగా ఉండటంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన తనను ఆధరించి పార్లమెంట్‌కు పంపిస్తే సమస్యలపై ఉద్యమిస్తానన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో పూర్తిస్థాయిలో పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళలు, రై తులు ఈ ఎన్నికల్లో ఆలోచించి నిర్ణ యం తీసుకోవాలన్నారు. పనిచేసే వారికే పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జగిత్యాల మండలం తాటిపల్లి గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ పట్నాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జడ్పీ చైర్మన్ దావవసంత సురేష్, ఇతర నేతలు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి

నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయిస్తా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

సిరికొండ, ఏప్రిల్ 30: ఎంపీగా గెలిచిన ఏడాదిలోపు జిల్లాలో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయిస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులను ప్రధాని నరేంద్రమోదీ సరిచేయడానికే పదేళ్లు పట్టిందన్నారు. ఇంకా సరిచేసి ప్రపంచ స్థాయిలో నిలపడానికి కృషి చేస్తున్న మోదీని మూడో సారి ప్రధాని చేయాలని కోరారు. జిల్లాలో సముద్రం లేనందున డ్రై పోర్టును ఏర్పాటు చేయించడంతో పాటు జక్రాన్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే 30 వేల నుంచి 40 వేల ఉద్యోగాలు వస్తాయని అర్వింద్ అన్నారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఏనాడు జిల్లా గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. గల్ఫ్ కార్మికుల కోసం ఏదో చేస్తానని చెపుతున్న జీవన్‌రెడ్డి 45 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎందుకు వారిని పట్టించుకోలేదని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పాలన అంతా అవినీతి కూపంగా మార్చి వేశారని ఆయన ఆరోపించారు. యూనిఫాం సివిల్ కోడ్ అమలు జరిగితే ముస్లిం మహిళల ఆత్మగౌరం పెరుగుతుందన్నారు. పసుపు ధర క్వింటల్‌కు రూ.20 నుంచి 30వేల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవల్సిందేనని అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పరిశ్రమలు కావాలన్నా, ఉద్యోగాలు రావాలన్నా నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని కావాల్సిందేనని అన్నారు. భారీ మెజార్టీతో మోదీని గెలిపించాలని అర్వింద్ కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, మాలోత్ మహేందర్, గోపి, రంజిత్‌రెడ్డి, గోపి శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని దూప్య తండాకు చెందిన సుమారు 20 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు మలోత్ మహేందర్ ఆధ్వర్యంలో ఎంపీ ధర్మపురి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సిరికొండలో నిర్వహించిన ఎన్నికల సభలో మాట్లాడుతున్న అర్వింద్

ప్రచారాలకు పార్టీ అగ్రనేతలు



- జిల్లాలో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- పార్లమెంట్ పరిధిలో ప్రచారంలో పాల్గొననున్న పార్టీ పెద్దలు
- కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా రానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం
- సభలు విజయవంతం చేసేందుకు మూడు పార్టీల నేతల సన్నద్ధం

నిజామాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ప్రధాన పార్టీల అగ్రనేతలు జిల్లాతో పాటు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు రానుండటంతో మరింత జోరుగా ప్రచారాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో బుధవారం కోరుట్లలో జరిగే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండగా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లోని నేతలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈనెల 5న నిజామాబాద్ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతుండగా ఆ పార్టీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, నిజామాబాద్‌లో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే రోడ్‌షోలు, బహిరంగ సభల్లో మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతుండటంతో ఆ పార్టీ నేతలు భారీ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు.

వేడెక్కుతున్న ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు 44 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదవుతుండగా అదే రీతిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రోజు పలు సభలు, రోడ్‌షోలలో పాల్గొంటున్నారు. ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థి జీవన్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రోడ్‌షోలతో పాటు ఇతర సమావేశాల్లో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పలు సమావేశాలకు, సభలకు, రోడ్‌షోలకు హాజరవుతూనే ఇంటింటి ప్రచారంలో కూడా పాల్గొంటున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో ఈ వారం రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అగ్రనేతలు ప్రచారానికి రానుండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ప్రచారాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్రనేతల పర్యటనలు తమకు ఉపయోగపడుతాయని భావిస్తూ భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు కోరుట్లలో కాంగ్రెస్ బహిరంగ

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బుధవారం కోరుట్లలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా నిజామాబాద్‌లో నామినేషన్ సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న సీఎం మరోదఫా కోరుట్ల సభకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం జరిగే ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, నేతలు, కార్యకర్తలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు కూడా సభకు హాజరవుతుండటంతో పూర్తి స్థాయిలో తమకు అనుకూలంగా మలుచుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సమయంలో నిర్వహిస్తున్న ఈ రెండవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, నిజామాబాద్ రూరల్, జగిత్యాల నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున క్యాడర్ హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభతో పాటు ఈనెల 11లోపు మరిన్ని సభలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 5న నిర్మల్‌కు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రానుండటంతో ఆ సభ కూడా తమకు అనుకూలంగా మలుచుకునేందుకు జిల్లా పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు.

బీజేపీ నేతల భారీ ప్రచారాలు

సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని నిలుపుకునేందుకు బీజేపీ నేతలు భారీ ఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకంటే ముందుగానే ప్రచారాలను మొదలు పెట్టారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సమావేశాలతో పాటు సభలు నిర్వహించారు. రెండు నెలల క్రితమే జగిత్యాలలో ప్రధాని మోదీ సభను నిర్వహించారు. నామినేషన్ చివరి రోజు ఉత్తరాఖండ్ సీఎం రావడంతో పాటు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. మరింత క్యాడర్‌లో జోష్ పెంచడంతో పాటు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఈనెల 5న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన ఎంపీ అర్వింద్‌కు మద్దతుగా పాల్గొననున్నారు. ఈ బహిరంగసభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు కసరత్తు మొదలు పెట్టారు. అగ్రనేత అమిత్‌షా పర్యటన వల్ల తమకు లాభిస్తుందని భావిస్తున్న పార్టీ నేతలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ సభ తర్వాత ఉత్తరప్రదేశ్ సీఎం యోగి కూడా ఈనెల 8 నుంచి 10 తేదీల మధ్య రానుండటంతో ఆ సభను కూడా విజయవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా సీటును నిలుపుకునేందుకు గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు..

బీఆర్‌ఎస్ తరపున ఈ దఫా ఎలాగైనా నిజామాబాద్ సీటును కైవసం చేసుకునేందుకు పార్టీ నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీలో ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ కె.సంజయ్, డాక్టర్ సంజయ్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేష్‌గుప్త, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషాతో పాటు ఇతర నేతలు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా పార్లమెంట్ పరిధిలో ఈనెల 5, 6 తేదీలో నిర్వహించనున్న సభలు, రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈనెల 5న జగిత్యాలలో, 6న నిజామాబాద్‌లో జరిగే సభల్లో ఆయన పాల్గొననుండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఇవేకాకుండా ఇతర సమావేశాలను కూడా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. వీటిలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీల తరపున అగ్రనేతలు పార్లమెంట్ పరిధిలోని ప్రచారాలకు రానుండటంతో మూడు పార్టీల నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు.


మోస్రాలో నిర్మించిన షాదీఖానా ఇదే..

ముచ్చటగా కట్టారు.. ముట్టకుండా వదిలేశారు!!

● మోస్రాలో మందుబాబులకు అడ్డాగా మారిన షాదీఖానా

మోస్రా, ఏప్రిల్ 30: మండలకేంద్రంలో 31-08-2015న అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కేటీఆర్, నాటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ.35లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. 05-06-2018 నాటికి నిర్మాణ పనులు పూర్తవ్వగా.. పోచారం శ్రీనివాస్ రెడ్డి షాదీఖానా భవనాన్ని ప్రారంభించారు. నిర్మించిన వాడుకోకుండా అలానే వదిలేశారు. పిచ్చిమొక్కలతో పాడైపోతున్నా.. పట్టించుకోకుండా వదిలేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళలలో చీకటిమయంగా మారింది. షాదీఖానా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగింది. ఇందులో మత ఆచారం ప్రకారం నిర్మాణం చేయలేదని ముస్లిం మత సంప్రదాయం ప్రకారం పురుషులు, మహిళలు వేరుగా ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకుంటారు. అలాంటి అవకాశం లేనందున ఇక్కడ కార్యక్రమాలు చేయట్లేదని స్థానికులు వాపోతున్నారు. నిరుపయోగంగా ఉండడంతో 2023లో రూ.20లక్షలు మంజూరైనా.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని మసీద్ సదర్ మతిన్ తెలిపారు. నిరుపయోగంగా ఉన్నందున బాత్‌రూమ్‌లకు సంబంధించిన తలుపులు ధ్వంసం చేశారని, వన్ హెచ్‌పీ మోటార్ సైతం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు. ఏది ఏమైనా నిర్మాణ సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ నిమిత్తం పంచాయతీ రాజ్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా ఫోన్ చేస్తే స్పందించలేదు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలను ఎడపల్లి గౌడ కులస్థులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గత శుక్రవారం నుంచి ప్రారంభం అయిన కల్యాణ మహోత్సవ వేడుకలు మంగళవారం ఎల్లమ్మ కళ్యాణంతో ముగిశాయి. ఉదయం నుండి గౌడ కులస్థులు బాజా బజంత్రీలతో ఐరండ్లు, మంగళ సూత్రం, మట్టెలు, తల్వాల బియ్యంను ఎదుర్కొని అమ్మవారి కల్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో గౌడ కులస్థులు, వారి బంధువులు, ప్రజలు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో హాస్టళ్లు తెరిచి ఉంచాలి

● రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేసిన గిరిజన శక్తి నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: యూనివర్సిటీ వేసవి సెలవుల్లో హస్టళ్లు తెరిచి ఉంచాలని గిరిజన శక్తి నాయకులు మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో చదువుతన్న విద్యార్థులంత పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారని, మెస్ బిల్లులు వర్సిటీ భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి సంఘం ప్రతినిధులు మోహన్ నాయక్, ప్రవీణ్ కుమార్, మౌసింగ్, రాము, తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: జిల్లా ఇంచార్జి వైద్య శాఖ అధికారిగా తుకారాం రాథోడ్ నియమితులయ్యారు. ఇదివరకు డిఎంహెచ్‌వోగా పనిచేసిన సుదర్శనం మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో తుకారాం రాథోడ్‌కు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. గత ఐదేళ్లుగా ఇంచార్జి డిఎంహెచ్‌వోగా సుదర్శనం పనిచేస్తున్నారు. పూర్తిస్థాయి డిఎంహెచ్‌వో నియామకం అయ్యేంతవరకు తుకారాం రాథోడ్ ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.

మస్కట్‌లో తప్పిపోయిన వాడి గ్రామవాసి

● స్వదేశానికి రప్పించాలని తల్లిదండ్రుల వినతి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన గోలి శివప్రసాద్ ఓమన్ రాజధాని మాస్కట్‌లో తప్పిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడిని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేయాలని ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడిని మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోలి శివప్రసాద్ ఈనెల 17వ తేదీన మాస్కట్‌కు వీసాపై వెళ్లాడని స్థానిక కంపెనీలో రిపోర్ట్ చేసిన రెండు రోజులకే తప్పిపోయాడన్నారు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నది తమకు తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. శివప్రసాద్‌కు సంబంధించిన ఫోన్, ఇతర వస్తువులు రూంలోనే వదిలివెళ్లినట్టు తెలిసిందన్నారు. స్పందించిన కోటపాటి ఓమన్‌లోని తెలుగు ప్రవాసీయుల సంక్షేమ సంఘం ప్రతినిధి గుండెటి గణేష్‌కు తప్పిపోయిన శివప్రసాద్ వివరాలను పంపి వేతికిపట్టుకొని స్వదేశానికి పంపాల్సిందిగా కోరారు.

సిరికొండలో తూనికల కొలతల అధికారుల దాడులు

● ఆరుగురి కేసులు నమోదు

సిరికొండ ఏప్రిల్ 30: సిరికొండ మండల కేంద్రంలో తూనికల కొలతల అధికారులు వ్యాపార సంస్థలపై దాడులు చేసి వస్తువులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.జిల్లా తూనికలకొలతల అధికారి ముహమ్మద్ షుజాత్ ఆధ్వర్యంలో సిరికొండలో వ్యాపార సంస్థల్లోకి వెళ్లి తనిఖీలు చేశారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. 21వేల జరిమానాలను వసూలు చేశారు. ఈ దాడుల్లో నిజామాబాద్ జోన్ సహాయ కంట్రోలర్ నిర్మల్‌కుమార్,సీనియర్ సాంకేతిక అధికారి రవీందర్,సాంకేతిక సహాయకులు సురేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కార్పొరేటర్లు

● ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌కు షాక్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల వేళ నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. మంగళవారం నగరానికి చెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిల సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్, 10వ కార్పొరేటర్ కోమలితో పాటు అర్సపల్లి కార్పొరేటర్ లావణ్య నవీన్‌లు బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నగరంలోని నిజాంఫంక్షన్‌హాల్‌లో జరిగిన హజ్ కమిటీ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.ఆయనతో పాటు ఎంపీఅభ్యర్థి జీవన్‌రెడ్డి,వక్ఫ్‌బోర్డు చైర్మన్ కుస్రో పాషా, ఉర్దూ అకాడమి చైర్మన్‌తాహెర్‌బిన్ హుందాన్‌లు పాల్గొన్నారు.

● ప్రచారం నిర్వహించిన మహేష్‌గౌడ్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ మంగళవారం నగరంలోని కంఠేశ్వర్, కుర్మావాడ, ఎస్సీ కాలనీ, హౌజింగ్ బోర్డు, విద్యుత్‌నగర్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా కూరగాయలు అమ్మే వారితో మాట్లాడి సరదాగా కూరగాయలు అమ్మారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, రత్నాకర్, తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో డిచ్‌పల్లి మండల విద్యార్థులు 93.04శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ అధికారి రాజగంగారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వనిత, డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన మంద అమూల్య, కేజీబీవీ పాఠశాలకు చెందిన అమృతా,సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మనోజలు 10జీపీఏ సాధించినట్లు ఎంఈవో తెలిపారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. కావ్య లహరి 9.8, 25మంది విద్యార్థులు 9.9 జీపీఏ సాధించారని సంగీత పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో 20మంది విద్యార్థులు 9.0జీఏపీ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని 2023-2024 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో మండలంలో 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. 403 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా అందులో 391 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థునులు నితీశా, రమ్యలు 10 జీపిఏ సాధించారు. మహాత్మా జ్యోతిభాపూలే విద్యార్థి 10 జీపీఏ సాధించినట్లు ఆయన తెలిపారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో పదవ తరగతిలో 94శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. 1849మంది విద్యార్థులు హాజరు కాగా 1742మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వీరిలో 10జీపీఏ 36మంది విద్యార్థులు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి 21మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి 15మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారన్నారు. అక్స్‌ఫర్డ్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు 10జీపీఏ, శ్రీ బాషిత పాఠశాలలో ఒకరు 10జీపీఏ సాధించినట్టు కరస్పాండెంట్‌లు మానస గణేష్, బాషిత సుందర్‌లు తెలిపారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చేనెల 16వ తేదీలోపు తాము చదివిన పాఠశాలలో పరీక్ష ఫీజు చెల్లించి జూన్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకావాలని ఎంఈవో కోరారు.

● ఆలూర్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్‌ఎం నరేందర్ తెలిపారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారన్నారు. అదే విధంగా ఆలూర్‌లోని తెలంగాణ మైనారిటీ బాలుర పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సయ్యద్ షైదర్ తెలిపారు.

పెర్కిట్: పది పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ మోడల్ పాఠశాల విద్యార్థులు ఏడుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించగా 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ప్రవీన్‌కుమార్ తెలిపారు. మోడల్ పాఠశాలలో రోహిణి, వేదశ్రీ, సయ్యద్‌అహ్మద్, కీర్తి, పునిత్, అఫియా, వాసవిలు 10జీపీఏ సాధించారని, పాఠశాలలో 98మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జక్రాన్‌పల్లి: మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫరీక్ష ఫలితాల్లో జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వి.శంకర్, కె.హర్షిత, అక్స్‌ఫర్డ్ పాఠశాలలో శ్రీజారెడ్డి, రాంరాజ్, సోనికుమారి, జక్రాన్‌పల్లి టీఎస్‌ఎంఎస్ ఎం.మధురి 10జీపీఏ సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. తొర్లికొండ, కొలిప్యాక్, జక్రాన్‌పల్లి కేజీబీవీ, పడకల్, కలిగోట్, చింతలూర్, లక్ష్మాపూర్, వివేకానంద స్కూల్, అక్స్‌ఫర్డ్, జక్రాన్‌పలిల టీఎస్ఎంఎస్, మునిపల్లి, కేశ్‌పల్లి, సికింద్రాపూర్, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. జక్రాన్‌పల్లి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించడం పట్ల విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండల విద్యార్థులు పదో తరగతి పాఠశాలలో తమ సత్తా చాటారు. మండలంలో మొత్తం 10 పాఠశాలలకు చెందిన 288 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. వారిలో 275 మంది ఉత్తీర్ణత సాధించారు. గుండారం జెడ్పీహెచ్‌ఎస్, ఖానాపూర్ జెడ్పీహెచ్‌ఎస్, కాలూరు జెడ్పీహెచ్‌ఎస్, తిర్మన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు నూరుశాతం పాస్ అయ్యారు. గుండారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు నలుగురు 9.7 జీపీఏ సాధించినట్లు పాఠశాల హెడ్మాస్టర్ జి.అమర్‌నాథ్, డాక్టర్ కాసర్ల నరేష్‌రావులు తెలిపారు. 9.7 జీపీపీఏ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సిరికొండ: ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సిరికొండ మండలానికి చెందిన తొమ్మిది ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఒకరు, ఓ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పదికి పది జీపీఏ పాయింట్లు సాధించారు. 562 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 544 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.గడ్కోల్, కొండూర్,న్యావనంది,సిరికొండ,మాడల్ స్కూల్, కేజీబీవీ, మహాత్మజ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాల చీమన్‌పల్లి, సిరికొండ హైస్కూల్లో అక్షర 9.8, అక్షయ 9.5 జీపీఏ పాయింట్లను సాధించారు. మోడల్ స్కూల్లో గుణకరన్, హర్షిని,9.8 జీపీఏ , కృతిక 9.7 జీపీఏ పాయింట్లను సాధించారు.మండలానికి చెందిన విద్యార్థులు మంచి జీపీఏ పాయింట్లను సాధించి మండలానికి మంచి పేరు తీసుకొచ్చారు.

కమ్మర్‌పల్లి: మంగళవారం విడుదల చేసిన పదవతరగత పరీక్ష ఫలితాల్లో కమ్మర్‌పల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో 95.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా మండంలోని చౌట్‌పల్లి, హసాకొత్తూర్, కోనాపూర్ ఉన్నత పాఠశాలలో వదంశాతం రిజల్ట్ సాదించగా 4 ప్రైవేటు పాఠశాలలు (మిసిమి, విజ్ఞానజ్యోతి, ఉషాజ్యోతి, శ్రీవిద్యాసాయి పాఠశాలలు) వంద శాతం రిజల్ట్ సాధించాయి.

ధర్పల్లి: మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఎస్సెస్సీ పరీక్షల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన చాట్ల చందన, సభావత్ అంకిత, లోలం మేఘన, పద్మ అక్షయ, మేగావత్ పల్లవిలు 10జీపీఏ సాధించారు. అదే పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులకు 9కి పైగా జీపీఏలు సాధించి మండలంలోనే మోడల్ పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు. పాఠశాలల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులను మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్ సాహెబ్, పాఠశాల వీడీసీ అభినందించారు.

నవీపేట: ఇటీవల మార్చిలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేయగా నవీపేట మండలంలో 94శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు తెలిపారు. నవీపేట జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల 86శాతం, నవీపేట జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల 92శాతం, జడ్పీహెచ్‌ఎస్ నాగేపూర్ 85శాతం, జడ్పీహెచ్‌ఎస్ అభంగపట్నం 81శాతం, జడ్పీహెచ్‌ఎస్ దర్యాపూర్ ఉర్దూ మీడియం 86శాతం, జడ్పీహెచ్‌ఎస్ జన్నేపల్లి 96శాతం, జడ్పీహెచ్‌ఎస్ బినోల వందశాతం, జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ వందశాతం, మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 98శాతం, నవీపేట టీఎస్ మోడల్ పాఠశాల 98శాతం, ఉన్నత పాఠశాల నవీపేట వందశాతం, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నవీపేట 93 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు. మండలంలో 583మంది విద్యార్థులకు గాను 549మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 34మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆయన పేర్కొన్నారు.

‘ప్రజా ఉద్యమాలు చేయడానికి తోడ్పడుతాయి’

పెద్దబజార్, ఏప్రిల్ 30: కార్మిక వర్గం, రైతాంగం, శ్రమజీవులు అందరికి అండగా ఉంటూ ప్రజా ఉద్యమాలు చేయడానికి తోడ్పడుతాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మంగళవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అఖిల భారత మహాసభలు విజయవంతంగా ముగిసిన అన్నారు. పార్టీలో పనిచేస్తున్న 14 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల మహాసభల్లో ఎన్నుకోబడిన వారు కేంద్ర మహాసభలో పాల్గొన్నారని అన్నారు. పీవోఆర్ ప్రస్తుత పరిస్థితులు కార్యక్రమం పంతాలను ఏకగ్రీవంగా ఆమోదించుకోవడం జరిగిందన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించడానికి విప్లవ పంతాను పార్టీ మహాసభ ఆమోదించిందని విప్లవ పంతాను ఎత్తిపట్టిందని భారత ప్రజల విప్లవ పోరాటాల అనుభవాలను పంతాకు ప్రాథమిక పునాధిగా చేసుకున్నట్లుగా డాక్యుమెంట్‌లో పేర్కొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, డివిజన్ నాయకులు శివకుమార్, జల్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ చెరువుకట్టపై దర్గా దగ్గర సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి జానకంపేట గ్రామానికి చెందిన కార్తీక్ (19), అర్బాస్ ఖురేషి (18) ఇద్దరు స్నేహితులు సారంగపూర్ గ్రామంలో గల రాయల్ ఫంక్షన్ హాలులో విందుకు హాజరయి తిరిగి వస్తుండగా బోధన్ నుండి నిజామాబాద్ వైపు వెలుతున్న ఏపి 28 ఏఎన్ 8012 నంబరు గల ఇన్నోవా వాహనం వేగంగా ఢీకొనడంతో అర్బాస్ ఖురేషి గాయాలతో రోడ్డు పై పడ్డాడు. ఇది చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తిరిగి ఉదయం చెరువులో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి వెలికి తీయగా అతను రాత్రి వాహనం ఢీకొట్టడంతో మరణించాడని అతని పేరు కార్తిక్‌గా గుర్తించారు. కార్తీక్ వాహనం ఢీ కొనడంతో ఎగిరి చెరువులో పడడంతో అతనిని ఎవరూ చూడలేదు. అర్బాస్ ఖురేషి తండ్రి ఖాజా ఖురేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

● బోధన్‌లో పార్టీ నాయకుల ప్రచారం

బోధన్‌రూరల్,ఏప్రిల్30: బీఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు అన్నారు. మంగళవారం బోధన్ మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బుధవారం బోధన్ పట్టణంలోని రమాకాంత్ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలచే భారీ సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరు కానున్నారన్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అబీద్, ఫ్లోర్ లీడర్ గంగారాం, అశ్వక్, తోకల గంగారెడ్డి, నక్క లింగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, బీర్కూర్ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

కూనేపల్లిలో వ్యక్తి మృతి

రెంజల్, ఏప్రిల్ 30 : మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన సరుకు గురప్ప(65)అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ సాయన్న తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనేపల్లి గ్రామానికి చెందిన గురప్ప జనవరి నెలలో టీవీఎస్ ఎక్సెల్ నడుపుతూ రెంజల్ బ్రిడ్జి వద్ద కింద పడడంతో గాయాలైన గురప్ప తన కొడుకు సాయిలు వద్ద జీవనం సాగిస్తున్నాడు. గత వారం రోజుల క్రితం తన స్వగ్రామమైన కూనేపల్లికి వచ్చిన గురప్ప గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం హోటల్ నందు టిఫిన్ చేస్తూ బెంచీపై నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని గ్రామస్థులు తెలిపారని ఎస్ఐ తెలిపారు. భిక్షాటన చేస్తూ ఎండలో తిరగడంతో వడదెబ్బ తగిలి ఆరోగ్యం క్షీణించి మృతి చెందడం జరిగిందని స్థానికులు తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సాయన్న పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

రుద్రూరు,ఏప్రిల్ 30: ఓ గుర్తు తెలియని శవం లభ్యమైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామశివారులోని కామ దేను రైస్‌మిల్ వెనుకలో గుర్తు తెలియని మగ శవం లభిం చింద న్నారు. అతని మెడలో హనుమంతుని లాకెట్, నడుముకి తెల్లని మొలతాడు, లూంగీ, తెల్లని షర్టు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. గుర్తు తెలి యని శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు తెలి పారు.ఆవ్యక్తికి సంబంధించిన సంబంధీకులు ఎవరైనా ఉంటే, వివ రాలు తెలిస్తే రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి ఒకరి మృతి

ఖిల్లా, ఏప్రిల్ 30: నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేట్ సమీపంలో ఇంటర్‌సిటీ రైలు కింద పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడు ఆదర్శ నగర్ ప్రాంతానికి చెందిన రాజవరపు శ్రీనివాస్‌గా గుర్తించినట్లు తెలిపారు. తన కుటుంబ ఆర్థిక సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన బోజపల్లి చిన్న గంగారాం (56) అనే వ్యక్తి అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు మంగళవారం వేల్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో చిన్నపాటి గొడవ కారణంగా సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. చిన్న గంగారాం కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ తెలిపారు. ఇట్టి వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే 8712659862నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్30: బోధన్ పట్టణం శక్కర్‌నగర్ రామ మందిరం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(35)మృతదేహం లభించినట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

నాళేశ్వర్‌లో వీడీసీ సభ్యులపై కేసు

నవీపేట,ఏప్రిల్30: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పలువురు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన మహిళ ఇల్లు నిర్మించుకోవడానికి పది ట్రాక్టర్ల ఇసుక కొరకు మండల రెవెన్యూ కార్యాలయంలో డీడీ చెల్లించిందని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి తహసీల్దార్ నారాయణ 10ట్రాక్టర్ల ఇసుకను మంజూరు చేస్తూ అనుమతులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సోమవారం సంబంధిత ఇంటి నిర్మాణానికి మూడు ట్రాక్టర్ల ద్వారా నాళేశ్వర్ వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా స్థానిక వీడీసీ సభ్యులు సంబంధిత ట్రాక్టర్లను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం సంబంధిత ట్రాక్టర్లను యాజమానులకు అప్పగించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం తహసీల్దార్ అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తున్నప్పటికీ నాళేశ్వర్ వీడీసీ సభ్యులు అడ్డుకోవడంపై తహసీల్దార్ నారాయణ నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పలువురు నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి గూపన్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ రూర ల్, ఏప్రిల్, 30: జిల్లా కేంద్రంలోని 3వడివిజన్ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నేత లు,కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రూరల్ ఎమ్మె ల్యే డాక్టర్ భూపతి రెడ్డిని కలిశారు. మాజీ ఎంపీటీసీ మాంతం లక్ష్మణ్, ఇతర బీఆర్ఎస్ నేతల కు ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భాగర్తి భాగారెడ్డి, జలందర్‌రెడ్డి, లింగం, గంగాధర్ తదితరులున్నారు.

3న ఆర్చరీ ఉచిత శిక్షణ ఎంపికలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30: జిల్లా యువజన మరియు క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన సాయి ఆధ్వర్యంలో విలు విద్యలో ఉచిత శిక్షణ శిబిరంలో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అధికారి ముత్తెన్న తెలిపారు.9 నుం చి 18 సంవత్సరాలలోపు యువతీ యువకులు నేరుగా నాగారంలోని రాజా రాం స్టేడియంకు ఎంపికల కోసం హాజరుకావాలని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ హైట్, వెయిట్, తదితర విభాగాల్లో పో టీలు ఉంటాయని ఇందులో ఎంపికైన వారిని ఉచిత శిక్షణ శిబిరానికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఒక ఫోటో, పుట్టిన సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు.

భాజపా రైతు వ్యతిరేక ప్రభుత్వం

● ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని, ఇండియా కూటమి లోని అభ్యర్థులను బలబర్చాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య అన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రైతాంగానికి ఉపయోగం లేవన్నారు. ప్రస్తుతం రైతుల పంటల కు ధరలు లేక పెట్టుబడి భారంగా మారిందని అన్నారు. ఆదానీ, అంబానీలకు దేశ సోమ్మును దోచిపెడుతున్నారని అన్నారు. విలేకర్ల సమావేశంలో నాయకులు దేవస్వామి, పీవైఎల్ ఉపాధ్యక్షుడు సాయినాథ్, దాస్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల మైనార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంటు జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మక్తకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్, ఎడపల్లికి చెందిన మాజీ కో ఆప్షన్ మెంబర్ జహీర్ అహ్మద్, అన్వర్ పాషా, అజర్, అబ్దుల్ సమద్, అలీఖాన్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మగ్గిడిలో వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 15రోజుల పాటు వాలీబాల్ ఆటల్లో క్రీడాకారులకు మేళకువలు నేర్పనున్నట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రత్యేక శిక్షణ ద్వారా మేళకువలు నేర్చుకున్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సుద్దపల్లి నర్సయ్య, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టులోపు రుణమాఫీ చేస్తాం :ఎమ్మెల్యే

ధర్పల్లి, ఏప్రిల్ 30: రైతులకు ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ ఆగస్టు లోపు పూర్తి చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోవింద్‌పల్లితో పాటు వివిధ గిరిజన తాండాలో ఆయన సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు లోపు రైతులకు రెండులక్షల రుణమాఫీ చేసి తీరుతామని ఈ సందర్భంగా ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఐదు ఎకరాలలోపు రైతులందరికి రైతుబంధును వర్తింపజేసినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఆరు గ్యారంటీలను చిత్తశుద్దితో అమలు చేశామని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, పార్టీ నాయకులు గాదారి మనోహర్‌రెడ్డి, చెలిమెల నర్సయ్య, ప్రవీణ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సుభాష్, చెలిమెల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, లాలాగౌడ్, మహేందర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎండాకాలంలో పశువుల రక్షణ అవసరం

వర్ని,ఏప్రిల్ 30: ఎండాకాలంలో పశువుల సంరక్షణ ఎంతో అవసరమని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జగన్నాథ చారి సూచించారు. శ్రీనగర్ గ్రామంలో మంగళవారం పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడాడు. పశువులు, మేకలు, గొర్రెలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకు వెళ్లాలని సూచించారు. ఎండ సమయంలో షెడ్డులు, పాకల్లో పడుకోబెట్టాలని కోరారు. వేసవిలో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరారు. పచ్చ మేత, దాణా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మండల వెటర్నరీ అధికారి సతీష్, రాచప్ప, రైతులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్ పెంచుతాం'

పెద్దబజార్, ఏప్రిల్ 30: ముస్లీం రిజర్వేషన్ తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్ పెంచుతామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో ఇటలీ కాంగ్రెస్ నాయకులు అధికార బలంతో బోగస్ ఓట్లను సృష్టించి హైదరాబాద్ ఓల్డ్‌సిటీ మాదిరిగా ఇందూరును మార్చే కుట్ర జరుగుతుందని అన్నారు. హైదరాబాద్‌లో 5లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని స్వయంగా కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ వ్యాఖ్యలు చేసినట్లుగా.. ఇందూరు అర్బన్‌లో కూడా ఓటమి భయంతో కాంగ్రెస్ అధికార బలంతో పోలింగ్ బూత్‌ల వారీగా వందల సంఖ్యలో మైనార్టీ బోగస్ ఓట్లను సృష్టించిందన్నారు. కాంగ్రెస్ వంద రోజుల్లో అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలు 420 హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారని అన్నారు. ఆనాడు బడుగు బలహీన వర్గాల నాయకులు భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని ఓడగొట్టింది కాంగ్రెస్ అని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బైకన్ మధు, మమత ప్రభాకర్, కిశోర్, బద్దం కిషన్, పవన్, శేఖర్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పదిలో సత్తా చాటిన కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు


వై.రితీష్‌రెడ్డి | జె.జాసన్ | నిత్యషా | బి.హాసిని

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30 : 10వ తరగతి వార్షిక ఫలితాలలో నగరంలోని కాకతీయ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. టి.నిత్యశ్రీ, వై.రితీష్‌రెడ్డి, కె.జాసన్, నిత్యషా, బి.హాసిని, ఎం.ఆశ్రిత, ఎ.వచన్, వై.శ్రీహితలు 10జీపీఏ సాధించిన వారిలో ఉన్నారు. వీరితో పాటు 33 మంది విద్యార్థులు 9.8 జీపీఏ పైన, 60 మంది విద్యార్థులు 9.7జీపీఏ పైన, 144 మంది విద్యార్థులు 9.5పైన జీపీఏ సాధించారు. స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ కోర్సును కళాశాల లెక్చరర్లచే విద్యాబోధన చేయడం ఇంటర్ నేషనల్ లెవల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షకుల ద్వారా బోధన చేయడం వల్ల ఈ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఫరీదుద్దీన్ తెలిపారు. ఇంతటి అద్భుత విజయాలకు కారకులైన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు విద్యాసంస్థల డైరెక్టర్లు తేజస్విని, రామోజీరావులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ప్రిన్సిపాళ్లు నటరాజ్, గిరిధర్‌రాజు, చంద్రశేఖర్‌లు అభినందించారు.

ఐఐటీ ఫౌండేషన్ పాఠశాల స్థాయి నుంచే : టి.నిత్యశ్రీ



పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ ప్రోగ్రాంను కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో బోధిస్తున్నారు. దీనివల్లే ఒలంపియాడ్ ఎగ్జామ్స్‌తో పాటు పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాను. ప్రణాళికబద్ధమైన తరగతులు, టీచర్ల పర్యవేక్షణ వల్లే నేను 10 జీపీఏ సాధించాను. ప్రతిరోజు 9గంటలు చదివేదాన్ని. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలనేది నా కోరిక.

ప్రణాళికబద్ధమైన తరగతుల వల్లే 10 జీపీఏ : ఎం.ఆశ్రిత



కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళిక బద్ధమైన తరగతుల నిర్వహణ ఉపాధ్యాయుల పర్యవేక్షణ వల్లే నేను 10 జీపీఏ సాధించాను. మా పాఠశాలలో ఐఐటీ ఫౌండేషన్ సిలబస్ తరగతులు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఐఐటీలో సీటు సాధిస్తా.

పదిలో ప్రతిభ చూపిన ప్రైవేటు పాఠశాలలు



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30 : 10వ తరగతి వార్షిక ఫలితాలలో జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు సత్తా చాటాయి. పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ గ్రేడ్‌లను సాధించడంతో పాటు వంద శాతం ఫలితాలను సాధించాయి.

▸ విజయ్ విద్యార్థుల ప్రతిభ

పదవ తరగతి ఫలితాలలో విజయ్ హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు 10 జీపీఏతో పాటు 9.8 జీపీఏ 21 మంది, 9.7 24 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.అక్షయ, అశ్విని, లాస్యశ్రీ, మదిహానాజ్, ప్రవళిక, శైనికరెడ్డి, శైనిక, శ్రీచరని, శ్రీవల్లి, శ్రీహితలతో పాటు మరికొంత మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. విద్యార్థులను అభినందించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రభాదేవి, డైరెక్టర్లు వసంత, సుజాత, ప్రిన్సిపాల్ విజేతలు పాల్గొన్నారు.

▸ అభ్యాస స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నగరంలోని వినాయక్‌నగర్‌లో గల అభ్యాస పాఠశాల పది ఫలితాలలో వందశాతం రిజల్ట్ సాధించింది. పాఠశాలకు చెందిన విద్యార్థులు అస్మాకైనాత్, కార్తికలు 10 జీపీఏ సాధించగా 9.8 ఆపైన జీపీఏను 49శాతం విద్యార్థులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ తెలిపారు.


అస్మాకైనాత్

▸ నలంద స్కూల్‌లో..

నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల నలంద హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించారు. పాఠశాలకు చెందిన డి.మేఘన, వై.సాత్విక, సీహెచ్ సాత్విక్‌లు 10 జీపీఏ సాధించినట్లు పాఠశాల అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు నంగునూరి ప్రకాశం, ఇంగు శ్రీనివాస్, పద్మావతి, తనుజ, మురళి పాల్గొన్నారు.


సాత్విక

▸ విశ్వభారతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నగరంలోని వినాయక్‌నగర్‌లో గల విశ్వభారతి పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు రుమేష సిమాన్ 9.8, బి.రాకేష్‌లు 9.7 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ రేఖరెడ్డి అభినందించారు.

▸ అరవిందో పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నగరంలోని దుబ్బాలో గల అరవిందో పాఠశాల విద్యార్థులు పది ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన ఎ.సంజన 10 జీపీఏ సాధించగా వరలక్ష్మి 9.3, వర్షిని 9.2, నందిని 9.2, ఆకాష్ 9.0 జీపీఏ సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి, ప్రిన్సిపాల్ సంధ్యరాణి తదితరులు అభినందించారు.


సంజన

▸ సేయింట్ జేవియర్స్ స్కూల్‌లో..

నగరంలోని వర్ని రోడ్‌లో గల సేయింట్ జేవియర్స్ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన బి.సాహితి, సి.ఆస్మితలు 9.8 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ లతాగౌడ్, తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ యాజమాన్యం

ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్ఆర్

నగరంలోని ఎస్ఆర్ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాలలో సత్తాచాటారు. విద్యాసంస్థకు చెందిన పలువురు విద్యార్థులు 10 జీపీఏ సాధించగా.. 9.8 జీపీఏ 16 మంది, 9.7 జీపీఏ 18 మంది విద్యార్థులు సాధించినట్లు జోనల్ ఇంచార్జ్‌లు ప్రణీత్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎండీ సనమ్, అభిజ్ఞ, విఠల్, హర్షిత్ రెడ్డి, స్వంజన, వెంకటప్రసూన్, హరిణి, తదితరులను విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్‌లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు ఇషక్‌హైమద్, సరళ, మేరీ పాల్గొన్నారు.

▸ వాసు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఎం. మదన్

నగరంలోని దుబ్బలోగల వాసు హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ గ్రేడ్‌లను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కర్నాటి వాసు అభినందించారు. పాఠశాలకు చెందిన ఎం.మదన్ 9.7, సీహెచ్ వైష్ణవి 9.5, ఎం.ఆస్మిత 9.3, కె.అఖిల 9.2, ఎస్.మనోజ్ 9.2, కృషితేజ 9.0 గ్రేడ్‌సాధించినట్లు వాసు తెలిపారు.

▸ విశ్వవికాస్ విద్యార్థులు..


కీర్తి

నగరంలోని గాయత్రీనగర్‌లోగల విశ్వవికాస్ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఫలితాలను సాధించినట్లు కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ సుశ్మితలు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.కీర్తి 10 జీపీఏ సాధించగా డి.భానుశ్రీ 9.8, అఖిల్ 9.7, రూప 9.5, వరుణ్ 9.5, ఇతర విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు వారు తెలిపారు.

బోధన్‌లోని విజయసాయి విద్యార్థుల ప్రతిభ

బోధన్‌రూరల్,ఏప్రిల్30: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో బోధన్‌లోని విజయసాయి విద్యార్థులు 12మంది ప్రతిభ కనబర్చి 10/10జీపీఏ సాధించారు. 99శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఐఆర్ చక్రవర్తి తెలిపారు. 363మంది పరీక్షలు రాయగా.. నలుగురు విద్యార్థులు మాత్రమే ఫెయిలయ్యారని తెలిపారు.

● మాతృశ్రీ విద్యార్థుల విజయదుందుభి

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో బోధన్ పట్టణంలోని మాతృశ్రీ పాఠశాల విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. పరీక్ష ఫలితాలలో 8 మంది 10/10జీపీఏ సాధించారు. ఏడుగురు 9.8 జీపీఏ, 8మంది 9.7జీపీఏ, పది మంది 9.5 జీపీఏ, 96శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యార్థులను కరస్పాండెంట్ దిగంబర్ అభినందించారు.

● ప్రజ్ఞ విద్యార్థుల ప్రతిభ

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో బోధన్‌లోని ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఐదుగురు విద్యార్థులు 10/10జీపీఏ సాధించారు. 8మంది 9.8 జీపీఏతో విద్యార్థులు తమ ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చౌడారెడ్డి, ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30: జూనియర్ మూడో సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలో రాష్ట్ర బాలికల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సాఫ్ట్‌బాల్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఎదురు లేదని మరోసారి నిరూపించింది. తెలంగాణ రాష్ట్ర జట్టులో జిల్లా క్రీడాకారులు రాణించి ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషి చేశారు. బాలికల విభాగంలో వైశాలి, సాత్విక, శ్రావిక, నేహశ్రీ, సౌమ్యరాణి, వైశాలి, బాలుర విభాగంలో సిద్దార్థ, తిరుపతిలు తమ ప్రతిభను చాటారు. ఎతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సంగీత్‌రావు, సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజరెడ్డి, నాయకులు అభినందించారు.

ఆదరించండి.. అండగా ఉంటా : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి


ఎడపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

ఎడపల్లి, ఏప్రిల్ 30: 'నన్ను ఆదరించండి.. మీకు అందరికీ అండగా ఉంటా.. నన్ను ఎంపీగా గెలిపించండి' అని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వారిని టపాసులు పేల్చి స్వాగతం పలికారు. ఎడపల్లి పాత బస్టాండులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పదేళ్ళపాటు అధికారంలో ఉన్న బిజేపి పార్టీ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, వారికి రైతులు అంటే పట్టింపు లేదన్నారు. మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పి ఎరువుల ధరలు పెంచి పెట్టుబడిని రెట్టింపు చేశారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడు దాన్యం ధర క్వింటాలుకు 1350 ఉండగా పదేళ్ల తరువాత 2200 వందలు మాత్రమే ఉందన్నారు. రెట్టింపు ఏదని ఆయన ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెబితే రైతులకు రుణమాఫీ చేస్తే సోమరిపోతులు అవుతారని బీజేపీ ఎంపీ అరవింద్ అనడం ఆ పార్టీకి రైతులపై ఉన్న ప్రేమను గుర్తు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఖాయిలా పడిన పరిశ్రమలను తెరిచే అవకాశం ఉన్నా చక్కెర పరిశ్రమను ఎందుకు తెరవలేదని అరవింద్‌ను ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు కమిటీ వేసి చర్యలు తీసుకున్నారని, తప్పక షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేవంత్ రెడ్డి పాలనలో 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించి, 500 లకే గ్యాస్ సిలిండర్‌ను అంఒదిస్తున్నామన్నారు. బతుకు దెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన కార్మికులను ఆదుకునేందకు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి అకాల మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, నాయకులు నగేష్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మల్కారెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

●మాట ఇస్తున్నాం.. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం: ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

రెంజల్,ఏప్రిల్30: ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని మాట ఇచ్చామంటే కచ్చితంగా చేసి తీరుతామని కాంగ్రెస్‌పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం రెంజల్ మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా బావులపై ఆధారపడి సాగు చేసే రైతులకు విద్యుత్ భారం కాకూడదని 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ ఉచిత విద్యుత్‌ను ప్రారంభించారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు 2004-2014వరకు పదేళ్ల వరకు ధాన్యం మద్దతు ధర 450నుంచి 1350రూపాయలు మూడింతలు పెంచారని, మాట ఇచ్చామంటే చేసి చూపే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు.

గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● డీఎల్‌పీవో శివకృష్ణ

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 30: వేసవి ఎండలు మండిపోతున్న తరుణంలో తాగునీటి ఇబ్బందులు ఎదురైతే తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను యుద్ధ పాతిపాదికన పరిష్కరించాలని ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రత్యేక అధికారి ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో సదాశివ్, కార్యదర్శి శాంతికుమార్ పంచాయతీ సిబ్బందితో సమీక్షించారు. తాగునీటి ఇబ్బందితో పాటు పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని లీకేజీలను యుద్ధ ప్రాతిపాదికన సరిచేయిస్తూ ప్రజలకు తానీటిని అందించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా రోజువారీ నీళ్లు పట్టేలా చూడాలని ఆదేశించారు. అనంతరం గ్రామశివారుల్లోని శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, పల్లెప్రకృతి వనాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.